sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 01-08-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 117 EDITOR: ROHINI

ఖాకీల కామ కీచకులు

రక్షకుల రూపంలో రాక్షసులు

- నమ్మకాన్ని హతమార్చిన పోలీసులు
- కామాంధులుగా మారిన అధికారులు
- కటకటాల వెనక్కి ఖాకీలు
- తెలంగాణలో ఐపీఎస్, సీఐల లీలలు

ఖాకీ డ్రెస్ వేసుకుని రక్షించాల్సిన వాళ్లే భక్షకులుగా మారుతున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన చేతులే నేరాలకు పాల్పడుతున్నాయి. తెలంగాణ పోలీస్ శాఖలో కలకలం రేపుతున్న లైంగిక వేధింపుల ఉదంతాలపై అత్యంత తీవ్రమైన విచారణ ఇది. నేరాలకు పాల్పడిన ఆ ముగ్గురి అధికారుల బండారం బట్టబయలైంది. రక్షక భటుల ముసుగులో సాగుతున్న అరాచకాలపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.
- సహనం వందే, హైదరాబాద్

సామాన్యుల రక్షణ కోసమే రాజ్యాంగం పోలీసులకు విశేష అధికారాలను కల్పించింది. అయితే ఈ అధికారాన్ని సద్వినియోగం చేసుకోవాల్సింది పోయి కొందరు అధికారులు విచక్షణ మరిచి అరాచకాలకు పాల్పడుతున్నారు. డ్యూటీ ఫస్ట్ ఫ్యామిలీ నెక్స్ట్ అనే నినాదంతో ముందుకెళ్లాల్సిన వారు కామాంధులుగా మారిపోయి మహిళల జీవితా లతో ఆడుకుంటున్నారు. తాజాగా తెలంగాణలో వెలుగు చూసిన ముగ్గురు అధికారుల బండారం పోలీసు శాఖలో ఉన్న కుళ్లిపోయిన వ్యవస్థను అద్దం పడుతోంది. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డితో పాటు జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు, మలక్‌పేట్ సీఐ నరసింహ చేసిన ఘాతుకాలు ఒక్కొక్కటిగా బయటపడటంతో డిపార్ట్‌మెంట్ ఉలిక్కిపడింది.

ట్రెయినీ ఐపీఎస్ అరాచక పర్వం

సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ ఐపీఎస్ ఎం. ఉదయ్ కృష్ణారెడ్డి సాటి మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై అఘాయిత్యాలకు పాల్పడ్డాడు. 2025 మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన బాధితురాలితో క్లోజ్‌గా మూవ్ అయిన ఉదయ్ ఈ జూన్ 23 నుంచి వేధింపులు మొదలుపెట్టాడు. వాట్సాప్‌లో అసభ్యకర మెసేజ్‌లు పంపడం, తోటి ట్రైనీస్ ముందు కించపరచడం, ఫోన్ లాక్కోవడం, గదిలో నిర్బంధించడం, జుట్టుపట్టుకొని లాగడం, గొంతు నులిమడం వంటి రాక్షస చర్యలకు ఒడిగట్టాడు. ఆమెకు సంబంధించిన ప్రైవేట్ వీడియోను రహస్యంగా రికార్డ్ చేసి భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేశాడు. జూలై 10న మరోసారి దాడి చేయడంతో బాధితురాలు అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించింది.

కటకటాల వెనక్కి ఉదయ్ కృష్ణారెడ్డి

పోలీసులు కేసులు నమోదు చేసి నాలుగు ప్రత్యేక బృందాలతో గాలించి మిర్యాలగూడ సమీపంలో కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం రాజేంద్రనగర్ లోని రంగారెడ్డి జిల్లా అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించి చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి 2025యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో ఐపీఎస్‌గా ఎంపికయ్యాడు.

జూబ్లీహిల్స్ సీఐ దారుణాలు

ఇక హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేసిన శ్రీనివాసులు రెడ్డి కుటుంబ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళను లొంగదీసుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి ఆమె గర్భం దాల్చిన తరువాత బెదిరించి బలవంతంగా అబార్షన్ చేయించాడు. రహస్యంగా చిత్రీకరించిన ఆమె ప్రైవేట్ వీడియోలను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేస్తూ రెండు కోట్ల రూపాయల వరకు దోచుకున్నాడు. బాధితురాలు నేరుగా డీజీపీకి అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపిన ఉన్నతాధికారులు శ్రీనివాసులు రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ ఇంకా కొనసాగుతోంది.

మలక్‌పేట్ సీఐ లీలలు

మలక్‌పేట్ సీఐ నరసింహ తమ డిపార్ట్‌మెంట్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాధితురాలపై వేధింపులకు దిగాడు. సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ వేధింపులు జరిగాయి. మొదటి భార్యకు చట్టబద్ధంగా విడాకులు ఇవ్వకుండానే రెండో వివాహం చేసుకున్నాడని, వారికి ఒక కుమారుడు కూడా ఉన్నాడని మొదటి భార్య ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో శాఖాపరమైన చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ ఆరోపణలపై హైదరాబాద్ సీపీ మలక్‌పేట్ సీఐ నరసింహను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ కేసులపై విచారణ కొనసాగుతోంది.

కఠిన శిక్షల కోసం డిమాండ్లు

గౌరవప్రదమైన ఖాకీ యూనిఫామ్ ధరించి ప్రజలను కాపాడాల్సిన అధికారులే నేరస్తులుగా మారుతుండటంతో మహిళలకు రక్షణ ఎక్కడ ఉందనే ప్రశ్న వ్యక్తమవుతోంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. డిపార్ట్‌మెంట్‌లో ఇలాంటి తప్పులు మరెవరూ చేయకుండా ఉండేలా కఠిన శిక్షలు అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు.

కొత్త రుచితో స్టార్‌బక్స్ కిక్

రిఫ్రెషర్లకు సరికొత్త సోడా టచ్

- సేల్స్ పెంచేందుకు కొత్త ప్లాన్
- కస్టమర్ల కోసం మరో రుచి
- స్థిరమైన వృద్ధిపై కంపెనీ గురి
- ప్రయోగాత్మకంగా కొత్త డ్రింక్స్

ప్రపంచ ప్రఖ్యాత కాఫీ సంస్థ స్టార్‌బక్స్ సరికొత్త ప్రయోగానికి తెరలేపింది. తమ వ్యాపారాన్ని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే అత్యంత ప్రజాదరణ పొందిన రిఫ్రెషర్ డ్రింక్స్‌ను కార్బొనేటెడ్ రూపంలో పరీక్షిస్తోంది. కొత్త రుచులతో కస్టమర్లను ఆకట్టుకుని లాభాల బాట పట్టాలని యాజమాన్యం నిర్ణయించుకుంది. - సహనం వందే, హైదరాబాద్

కంపెనీ అమ్మకాలను పెంచుకోవడమే లక్ష్యంగా స్టార్‌బక్స్ కొత్త ప్రణాళికలు రచిస్తోంది. మార్కెట్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ వ్యూహాలను మార్చుకుంటోంది. కేవలం పాత డ్రింక్స్‌పైనే ఆధారపడకుండా కొత్త రుచులను కస్టమర్లకు పరిచయం చేస్తోంది. ఇందులో భాగంగానే పాత రిఫ్రెషర్ డ్రింక్స్‌లో గ్యాస్ నింపి సోడా లాంటి కార్బొనేటెడ్ డ్రింక్స్‌గా మారుస్తోంది. ఈ కొత్త ప్రయోగం తో స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధించాలని కంపెనీ భావిస్తోంది. మార్కెట్లో నిలదొక్కుకునేందుకు శుక్రవారం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

రిఫ్రెషర్లకు సోడా కిక్

సాధారణంగా దొరికే రిఫ్రెషర్ డ్రింక్స్‌ను జనాలు బాగా ఇష్టపడతారు. ఇప్పుడు వాటికే కాస్త బుడగలు వచ్చేలా చేసి కార్బొనేటెడ్ రూపంలో అందిస్తున్నారు. ఇలా చేయడం వల్ల డ్రింక్ తాగేటప్పుడు సరికొత్త ఫీలింగ్ వస్తుంది. వేసవిలో ఇలాంటి డ్రింక్స్ ఎక్కువగా అమ్ముడుపోతాయి. యువతను ఆకర్షించడానికి ఇదొక మంచి మార్గంగా కంపెనీ ఎంచుకుంది. పాత రుచికి కొత్త రూపు ఇచ్చి మార్కెట్లో సందడి చేయాలని ప్రణాళికలు వేస్తున్నారు.

ప్రయోగాత్మకంగా టెస్టింగ్ మొదలు

ఈ కొత్త కార్బొనేటెడ్ డ్రింక్స్‌ను కంపెనీ నేరుగా అందరికీ అందుబాటులోకి తీసుకురాలేదు. ముందుగా కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే వీటిని పరీక్షిస్తున్నారు. కస్టమర్ల నుంచి వచ్చే స్పందనను బట్టి తదుపరి నిర్ణయం తీసుకుంటారు. జనాలు ఈ కొత్త రుచిని ఎంతగా ఇష్టపడుతున్నారో నిశితంగా గమనిస్తున్నారు. ఈ టెస్టింగ్ పూర్తయిన తర్వాతే అధికారికంగా మార్కెట్లోకి వదులుతారు.

వ్యాపారంలో సరికొత్త ట్రెండ్

ప్రపంచవ్యాప్తంగా కాఫీ షాపుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ పోటీని తట్టుకుని నిలబడాలంటే ఎప్పటికప్పుడు కొత్త ప్రొడక్ట్స్ తీసుకురావాల్సిందే. ఆ దిశగానే స్టార్‌బక్స్ వేగంగా పావులు కదుపుతోంది. కస్టమర్లు ఎప్పుడూ ఒకే రకమైన రుచులతో బోర్ కొట్టకుండా చూసుకుంటోంది. ఈ కార్బొనేటెడ్ డ్రింక్స్ మార్కెట్లో ఒక కొత్త ట్రెండ్ సృష్టిస్తాయని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఆలోచన కచ్చితంగా సక్సెస్ అవుతుందని భావిస్తున్నారు.

లాభాల వేటలో కంపెనీ

ఏ వ్యాపారానికైనా స్థిరమైన లాభాలు చాలా అవసరం. స్టార్‌బక్స్ కూడా ఇదే సూత్రాన్ని పాటిస్తోంది. కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా అందరినీ ఆకట్టుకునేలా మెనూను మార్చుతోంది. కాఫీలు టీలు తాగని వారి కోసం ఇలాంటి కూల్ డ్రింక్స్ పరిచయం చేస్తోంది. దీనివల్ల ఎక్కువ మంది కస్టమర్లు తమ షాపులకు వస్తారని ఆశిస్తున్నారు. తద్వారా సంస్థ ఆదాయం భారీగా పెరుగుతుందని లెక్కలు వేసుకుంటున్నారు.

రాబోయే రోజుల్లో మార్పులు

ఈ టెస్టింగ్ ఫలితాలు సానుకూలంగా వస్తే ప్రపంచవ్యాప్తంగా భారీ మార్పులు రావడం ఖాయం. అన్ని దేశాల్లోని బ్రాంచుల్లో ఈ కార్బొనేటెడ్ రిఫ్రెషర్లు అందుబాటులోకి వస్తాయి. కస్టమర్లకు ఇదొక మంచి ప్రత్యామ్నాయంగా మారుతుంది. వ్యాపారంలో దూసుకుపోవడానికి స్టార్‌బక్స్ చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతవరకు సఫలం అవుతుందో వేచి చూడాలి. ఏదేమైనా కొత్త రుచులను ఆస్వాదించే వారికి ఇది నిజంగా శుభవార్తే.

తిరిగొచ్చిన గళం

ఇన్నాళ్లూ స్వదేశానికి దూరం

- 19 ఏళ్ల తర్వాత కోల్‌కతాలో అడుగు
- గళం వినిపించేలా వేదికపై కవితలు
- ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ ప్రయాణం


ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్

బంగ్లాదేశ్ నుంచి బహిష్కరణకు గురై దశాబ్దాలుగా ప్రవాస జీవితం గడుపుతున్న ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ సరిగ్గా 19 సంవత్సరాల తర్వాత కోల్‌కతాలో అడుగుపెట్టారు. 2007 నవంబర్ తర్వాత ఆమె మళ్లీ ఈ నగరానికి రావడం ఇదే మొదటిసారి. భావప్రకటన స్వేచ్ఛపై మతవాదులు చేసిన దాడులను ఎదిరిస్తూ తన గళాన్ని మరోసారి వినిపించేందుకు ఆమె రాక ఇప్పుడు రాజకీయంగానూ, సామాజికంగానూ తీవ్ర చర్చనీయాంశమైంది.
- సహనం వందే, కోల్‌కతా

తస్లీమా నస్రీన్ శుక్రవారం కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగారు. బంగ్లాదేశ్ నుంచి వేధింపులు ఎదుర్కొని 1994 లోనే దేశం విడిచి వెళ్లిన ఆమె, 2004 లో కోల్‌కతాలో ఆశ్రయం పొందారు. అయితే 2003లో తన పుస్తకంపై వచ్చిన నిరసనలు, 2007 నవంబర్ లో జరిగిన హింసాకాండ కారణంగా అప్పటి బుద్ధదేవ్ భట్టాచార్య ప్రభుత్వం ఆమెను నగరం నుంచి బలవంతంగా పంపేసింది. అప్పట్లో జైపూర్, ఢిల్లీల ద్వారా విదేశాలకు వెళ్లిన ఆమె దశాబ్దాల తర్వాత మళ్లీ అదే నగరానికి చేరుకున్నారు. ఈ రాకను ఆమె తన సొంత దేశానికి వస్తున్న భావోద్వేగ క్షణంగా అభివర్ణించారు.

బెంగాల్ గడ్డపై సాహిత్య ప్రయాణం

కోల్‌కతాకు తిరిగి వచ్చిన తస్లీమా నస్రీన్ రవీంద్ర సదన్ లో జరిగే మతతత్వ వ్యతిరేక సాహిత్య కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ వేదికపై ఆమె తొలిసారిగా బహిరంగంగా కవితలు వినిపించనున్నారు. ఈ పర్యటనకు భద్రత కల్పించిన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి, నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఏది ఉన్నా రచయిత్రి స్వేచ్ఛ మాత్రం ప్రాథమిక హక్కుగా ఉండాలని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ లో కొద్ది నెలల క్రితం భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుణంలో ఈ సాహిత్య కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది.

మతవాదంపై రాజీలేని పోరాటం

మహిళల హక్కులపై, మత తీవ్రవాదంపై తస్లీమా నస్రీన్ ఎప్పుడూ నిష్కర్షగా రాస్తూనే ఉన్నారు. మత గ్రంథాలు సమకాలీన సమాజానికి పనికిరావని చెప్పినందుకే తనను దేశం నుంచి బహిష్కరించారని ఆమె తెలిపారు. మతాలను ప్రభుత్వం నుంచి వేరు చేయాలని, 21 వ శతాబ్దంలో 7 వ శతాబ్దపు చట్టాలను అమలు చేయాల్సిన అవసరం లేదని ఆమె గట్టిగా పోరాడుతున్నారు. ఇరాన్‌లో మహిళలపై ఆంక్షలను తీవ్రంగా వ్యతిరేకిస్తూనే అమెరికా, ఇజ్రాయెల్ సైనిక జోక్యాన్ని కూడా తాను సమర్థించబోనని స్పష్టం చేశారు.

భారత్ బంగ్లాదేశ్ పరిస్థితులపై...

ఇండియాలో ముస్లింలకు సమాన హక్కులు ఉన్నాయని, హిందువులతో సమానంగా అన్ని ప్రయోజనాలు పొందుతున్నారని తస్లీమా నస్రీన్ విశ్లేషించారు. భారత్ లో ముస్లింల జనాభా తగ్గడం లేదని, కానీ బంగ్లాదేశ్ లో హిందువుల జనాభా మాత్రం వలసల కారణంగా తగ్గిపోయిందని తెలిపారు. బంగ్లాదేశ్ లో హిందువులు అణచివేతకు భయపడి కోర్టులకు కూడా వెళ్లలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనాలో అఘాయిత్యాలపై ఆందోళన చెందుతున్న వారు ముందుగా తమ దేశంలో జరుగుతున్న తప్పులనే సరిదిద్దుకోవాలని సూచించారు.

స్వేచ్ఛే ప్రాతిపదికగా ప్రజాస్వామ్యం

సెక్యులరిజంకు, మతతత్వానికి మధ్యే అసలైన సంఘర్షణ జరుగుతోందని తస్లీమా నస్రీన్ తేల్చిచెప్పారు. స్వేచ్ఛను కోరుకునే వారికి, కోరుకోని వారికి మధ్యే తేడా ఉందని వివరించారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసే హక్కు ఇతరులను విమర్శించే స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం మనగడ సాధ్యం కాదని అన్నారు. విదేశాల్లో సుదీర్ఘకాలం గడిపినా ఎప్పుడూ తన రచనల ద్వారా మహిళా సాధికారత కోసం, అభ్యుదయ భావాల కోసం ఆమె తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.